
ప్రజాశక్తి

శనివారం 13 జనవరి 2024

5

పార్వతీపురం మన్యం



జాతీయస్థాయి క్రీడలకు గిరిజన విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని కొత్తగూడ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న మండంగి శేఖర్ జాతీయస్థాయి క్రీడలకు ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ మాధవరావు తెలిపారు. ఫెన్సింగ్ స్కూల్ గేమ్స్ అండర్-14 బాలుర, బాలికల విభాగంలో గత ఏడాది డిసెంబర్ 10 నుంచి 12వ వరకు ఖమ్మం మున్సిపల్ స్కూల్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని మంచి ప్రతిభ కనబరిచి కాంస్య పతకం సాధించి జాతీయస్థాయి క్రీడలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. జనవరి 13 నుంచి 17 వరకు చత్తీస్ ఘడ్‌లోని జగదల్‌పూర్‌లో జరగనున్న జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొంటాడని తెలిపారు. విద్యార్థి ఎంపిక పట్ల హెచ్‌ఎం నాగరాజు, డిప్యూటీ వార్డెన్ గంగారావు అభినందించారు.

కోటి సంతకాలతో 'జగనన్నకు చెబుదాం'

- వినికిడి, స్పృహ లేని ప్రభుత్వం : పక్కి రవీంద్ర
- కోర్టు తీర్పులను అమలు చేయాలి : టి.జోగారావు
- దేశవ్యాప్త సంఘీభావంతో పోరాటం జయప్రదం : యుటిఎఫ్
- 32వ రోజుకు చేరిన అంగన్వాడీల నిరవధిక సమ్మె

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ప్రతి తల్లి తన బిడ్డ కోసం శ్రమిస్తే, అంగన్వాడీలు ఆ బిడ్డల శ్రేయస్సు కోసం కృషి చేస్తున్నారని, వారు చేస్తున్న కృషి, శ్రమ వెలకట్టలేనిదని, అటువంటి అంగన్వాడీ మహిళలు రోడ్డున పడడం అన్యాయమని వక్తలు ప్రభుత్వాన్ని విమర్శించారు. అంగన్వాడీలు చేస్తున్న నిరవధిక సమ్మె పోరాటం శుక్రవారానికి 32వ రోజుకు చేరుకున్న నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా కోటి సంతకాలతో జగనన్నకు చెబుతాం కార్యక్రమం పిలుపులో భాగంగా స్థానిక కలెక్టరేట్ వద్ద చేపడుతున్న సమ్మె శిబిరంలో ప్రముఖ కవి రచయిత పక్కి రవీంద్ర, ప్రముఖ న్యాయవాది టి. జోగారావు, యుటిఎఫ్ నాయకులు ఎస్.మురళీమోహన్, తోట రమేష్, సిఐటియు నాయకులు జి.వెంకటరమణ, వి.ఇందిర, ఎఐటియుసి నాయకులు, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు గంట జ్యోతి, నాయకులు పార్వతమ్మ, గౌరీ మణి సంతకాలు పెట్టి కార్యక్రమాని ప్రారంభించారు. తొలుత పక్కి రవీంద్ర మాట్లాడుతూ పిల్లలకు అన్నం పెట్టి, ప్రాథమిక విద్యానందించే అంగన్వాడీలు రోడ్డున పడడం దౌర్భాగ్యమని మండిపడ్డారు. ఇన్నిరోజులు అంగన్వాడీలు రాత్రి, పగలు, ఎండా, చలిలో ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం అన్యాయమని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వంలో చలనంతో పాటు వినికిడి, స్పృహ లేదని విమర్శించారు. జోగారావు మాట్లాడుతూ అంగన్వాడీల పోరాటం న్యాయమైందని, మేధావులు న్యాయ తీర్పులను గౌరవించడంతో పాటు అమలు చేయాలని అన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చినప్పటికి ప్రభుత్వం అమలు చేయకపోవడంతో కోర్టు ధిక్కరణకు గురవ్వడమేనని అన్నారు. వెంటనే సుప్రీం కోర్టు తీర్పును అమలుచేయాలనీ డిమాండ్ చేశారు. ఎస్.మురళీ మోహన్ మాట్లాడుతూ అంగన్వాడీలు చేస్తున్న పోరాటానికి దేశవ్యాప్తంగా సంఘీభావం వస్తుండడంతో పోరాటం విజయవంతమైనట్టేనని తెలిపారు. ప్రతిపక్ష పార్టీలు నిర్దిష్ట హామీలతో ముందుకురావాలని, గతంలో చంద్రబాబు, నేడు జగన్మోహన్ రెడ్డి అంగన్వాడీలను రోడ్డు పాలుచేయడం అన్యాయమని వాపోయారు. ప్రభుత్వం ఈ సమ్మెను అణచివేయాలని సెంటర్ల తాళాలు పగలగొట్టడం, ఇతర ప్రభుత్వ ఉద్యోగులతో సెంటర్లు నడిపించాలని ప్రయత్నించడం సరైనది కాదని అన్నారు. వెంటనే ఎస్మాను రద్దు చేయాలని, సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు జయమని, ధర్మవతి, గౌరి, రాజేశ్వరి మరియు తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ : తమపై అన్యాయంగా ప్రయోగించిన ఎస్మాను తక్షణమే రద్దు చేసి అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపలని అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్ హిమప్రభ డిమాండ్ చేశారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో ఉన్న శిబిరంలో మొట్టికాయలు పెడుతూ నిరసన తెలియజేశారు. కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి ప్రజలు మద్దతు కోరారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కోశాధికారి బి.అమరవేణి, ప్రాజెక్ట్ అధ్యక్షులు జి జెస్సీబాయి, ప్రతినిధులు జి శారద, దివ్య, భవాని, లలిత, శ్రీదేవి, మణి పాల్గొన్నారు.

సాలూరు : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన కార్యకర్తలు, హెల్పర్లు స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి ర్యాలీ నిర్వహించారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ యూనియన్ నాయకులు శశికళ, నారాయణమ్మ, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వై నాయుడు ఆధ్వర్యాన చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కె.జానకీరావు, మండల కార్యదర్శి ఎ.గణేష్ ప్రారంభించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు తిరుపతమ్మ, సుభద్ర, అరుణకుమారి పాల్గొన్నారు.

కురుపాం : అంగన్వాడీల హక్కులపై చేపట్టిన దీక్ష నెల రోజులు దాటినా ప్రభుత్వం స్పందించకపోవడంతో శుక్రవారం దీక్షా శిబిరం ఎదుట అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు పి.సరళకుమారి ఆధ్వర్యంలో కోటి సంతకాలు స్వీకరణ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ కార్యదర్శి జె.సరోజ, సెక్టార్ నాయకులు ఎం.మీనాక్షి , డివి రత్నం, బి.జయలక్ష్మి, ఎస్.సులోచన, డి.జ్యోతిలక్ష్మి, ఎన్.సుమతి తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ప్రజా సంఘాల జిల్లా నాయకులు నాయకులు రెడ్డి వేణు మాట్లాడారు. అంగన్వాడీలకు తెలంగాణ కన్నా అదనంగా వేతనాలు చెల్లిస్తానని సిఎం జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం బెదిరింపు చర్యలు మానుకోవాలని, లేకుంటే ప్రజాసంఘాలు ప్రజల మద్దతు కూడగట్టి అంగన్వాడీల సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు వారు చేస్తున్న సమ్మెకు అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహనరావు, సిఐటియు నాయకులు గవర వెంకటరమణ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రెడ్డి ఈశ్వరరావు, రైతు సంఘం నాయకులు రెడ్డి లక్ష్మీనాయుడు, ఆటో యూనియన్ నాయకులు రెడ్డి సన్యాసినాయుడు తదితర ప్రజానీకం సంతకాల సేకరణలో పాల్గొన్నారు.

సీతంపేట : స్థానిక ఐటిడిఎ ఎదుట తలపెట్టిన అంగన్‌వాడీల నిరవధిక సమ్మెలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్ యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు హిమప్రభ పాల్గొన్నారు. మాట్లాడుతూ ప్రభుత్వం యూనియన్ నాయకులను చర్చలకు పిలుస్తూ, మరోవైపున ఐసిడిఎస్ అధికారులతో అంగన్వాడీ కార్యకర్తల కుటుంబ సభ్యులకు నోటీసులివ్వడం బాధాకరమన్నారు. ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తే సహించేది లేదన్నారు, అనంతరం పలు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి సంతకాలను సేకరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పార్వతి, దర్శమి, అంజలి, ప్రియ, అరుణకుమారి, సురేష్, తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

భోగీ మంటల్లో జీవో 2 కాపీలు దగ్ధం

కొమరాడ : అంగన్వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అంగన్వాడీ యూనియన్ నాయకులు అనురాధ డిమాండ్ చేశారు. శుక్రవారం 32వ రోజు సమ్మె సందర్భంగా కొమరాడలో సమ్మె శిబిరంలో కోటి సంతకాలు సేకరణ చేపట్టారు. అనంతరం భోగిమంటలు వేసి అందులో ఇటీవల ప్రభుత్వం ప్రయోగించిన ఎస్మా చట్టం జిఒ 2 ప్రతులను వేసి దగ్ధం చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ కొమరాడ ప్రాజెక్టు ఉపాధ్యక్షులు సిరికి అనురాధ, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి, నాయకులు బి.అలివేలు, మంగ, జ్యోతి, మల్లేశ్వరమ్మ, పద్మ, జయమ్మ, కె.వరలక్ష్మి, లలిత, రైతు సంఘం నాయకులు ఉపేంద్ర, వ్యవసాయ కార్మిక, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



పార్వతీపురంలో సంతకాలు చేస్తున్న రచయితలు, ప్రజాసంఘాల నాయకులు







సీతానగరంలో సంతకాలు సేకరిస్తున్న అంగన్‌వాడీలు ; కొమరాడలో భోగీ మంటల్లో జిఒ 2 ప్రతులను దగ్ధం చేస్తున్న అంగన్‌వాడీలు; సాలూరులో ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీలు

బెల్లానా..? చిన్న శ్రీనా?





- వైసిపి అభ్యర్థిత్వంపై ఉత్కంఠ
- ఎవరిని వదులుకున్నా పార్టీకి నష్టమే..!
- తటపటాయిస్తున్న అధిష్టానం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయనగరం ఎంపీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ బెల్లాన చంద్రశేఖరా..? జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావా (చిన్న శ్రీను)?... ఇంతకీ ఎవరు? ఇదీ జిల్లాలో సాగుతున్న ఆసక్తికర చర్చ. తనకు సిఎం నుంచి హామీ ఉందని, తప్పకుండా తనకే సీటు దక్కుతుందని బెల్లాన చెబుతున్నారు. ఇప్పటికే చిన్న శ్రీనుకు ఎంపీ టిక్కెట్ ఖరారైందని ఆయన అనుచరులు, అభిమానులు చెప్పుకుంటున్నారు. అధిష్టానం మాత్రం సీటు కేటాయింపు విషయం వెల్లడించేందుకు తటపటాయిస్తోంది. ఇందుకు బలమైన కారణాలే కనిపిస్తున్నాయి. జిల్లాలో ప్రస్తుతం ఉన్న సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో బొబ్బిలి మినహా పెద్దగా మార్పులు ఉండకపోవచ్చు. చిన్న శ్రీను ఈసారి ఎమ్మెల్యే లేదా ఎంపీగా పోటీచేయాలనే తలంపుతో ఉన్నారు. ముందు నుంచీ అనుకున్నట్టు బొబ్బిలిలో స్థానిక ఎమ్మెల్యేను మార్పుచేసినా సామాజిక సమీకరణాల నేపథ్యంలో చిన్నశ్రీనుకు అవకాశం ఉండదని చాలాకాలంగా చర్చనడుస్తోంది. ఈనేపథ్యంలోనే చిన్నశ్రీనుకు ఎంపీ సీటు కట్టబెడతారని ప్రచారం జరుగుతోంది. అలా అయితే సిట్టింగ్ ఎంపీ బెల్లాన భవితవ్యం ఏమిటి అనేది ప్రశ్న. వీరిద్దరిలో ఒకరికి ఎచ్చెర్ల ఎమ్మెల్యే సీట్లు, మరొకరికి విజయనగరం ఎంపీ సీటు ఇస్తారని కూడా చర్చనడుస్తోంది. అటు ఎచ్చెర్ల స్థానిక ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్‌ను ఈసారి పక్కనబెడితే ఈ ఫార్ములా బాగానే అమలు అయ్యే అవకాశం ఉంది. కానీ, కిరణ్‌ను తప్పనిసరిగా పక్కనబెడతారనేది సందేహమేనని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఈనేపథ్యంలో ఎంపీ సీటు యథాతథంగా బెల్లానకు ఇచ్చేస్తే చిన్న శ్రీను సంగతి ఎలా ఉంటుందనేది ప్రశ్న. చిన్న శ్రీను జిల్లాలో అన్నీ తానై వ్యవహరిస్తున్న నేపథ్యంలో ఎంపీ టిక్కెట్ కట్టబెడితే అసెంబ్లీ స్థానాలన్నీ కలుపుకుని ఎన్నికల గట్టెక్కించేందుకు ప్రయత్నిస్తారని పార్టీ ఆలోచిస్తున్నట్టుగా తెలుస్తోంది. ఈ విధంగా జిల్లా పార్టీకి నాయకత్వం వహిస్తున్న చిన్న శ్రీనుకి ఈ ఎన్నికల్లో సముచిత స్థానం కూడా కట్టబెట్టినట్టుగా ఉంటుందని పార్టీ యోచిస్తోంది. కానీ, బెల్లాన ప్రభావం చీపురుపల్లి నియోజకవర్గంతో ముడిపడి ఉంది. ఒక వేళ బెల్లానను పక్కనబెడితే ఎన్నికల్లో పార్టీకి పనిచేస్తారా? ప్రతిపక్ష పార్టీ ఏదైనా ఆఫర్ ఇస్తే అదే నియోజకవర్గం నుంచి మరోసారి ఎమ్మెల్యేగా తలపడుతున్న రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ పరిస్థితి ఎలా ఉంటుంది. ఈ కోణాల్లో పార్టీ ఆలోచిస్తున్నట్టు సమాచారం. మంత్రి బొత్స కూడా ఇదే సందేహంతో ఉన్నట్టుగా రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు. ఇలా ఓవైపు జిల్లాను ఏకతాటిపై నడిపిస్తున్న చిన్న శ్రీనుకి అవకాశం ఇవ్వాలా? లేక ప్రస్తుతం ధర్నాలు, నిరసనలతో ప్రభుత్వానికి ఉక్కిరిబిక్కిరి చేస్తున్న ఉద్యమాలను మాటలగారడితో చల్లారుస్తున్న సీనియర్ మంత్రి బొత్స భవితవ్యం చూడాలా? అన్నది వైసిపి అధిష్టానం ముందు ప్రస్తుతం సవాలుగా నిలిచింది. అందువల్లే అటు శ్రీకాకుళం ఇటు విశాఖపట్నం ఎంపీ అభ్యర్థులను ఖరారు చేసి ప్రకటించినప్పటికీ విజయనగరం అభ్యర్థిని మాత్రం ప్రకటించలేదని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

జోరుగా జిజిఎం పనులు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

జిల్లాలో గల నాలుగు నియోజక వర్గాల్లో గడప గడపక మన ప్రభుత్వం (జిజిఎం) పనులు జోరుగా సాగుతున్నాయని జిల్లా పంచాయితీ రాజ్ ఇంజనీరింగ్ అధికారి కృష్ణాజీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1766 పనులతో రూ.44.73 కోట్లు అంచనా విలువతో మంజూరు కాగా, ఇంతవరకు 353 పనులు పూర్తయ్యాయని, మరో 351 పనులు ప్రస్తుతం జరుగుతున్నాయని అన్నారు. ఇంతవరకు రూ.737 లక్షలు మాత్రమే ఖర్చయ్యాయని తెలిపారు. ఈ రూ.737 లక్షల పనులు జరిగిన వెంటనే సదరు గుత్తేదారులకు వెనువెంటనే చెల్లిస్తామని తెలిపారు. ఇది పనులు బాగా జరిగే సీజన్ కాబట్టి ఇప్పటి వరకు గ్రామాల్లో మంజూరైన గడప గడపకు మన ప్రభుత్వం పనులు వెంటనే చేయాల్సిందిగా సదరు గ్రామ సర్పంచులకు, మండల ప్రాదేశిక సభ్యులకు, మండల స్థాయి ప్రజా ప్రతినిధులను కోరారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి

పెండింగ్ బిల్లుల చెల్లింపుపై సత్వరమే చర్యలు తీసుకోవాలని, అభివృద్ధి పనులను వేగవంతంగా చేపట్టాలని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు పంచాయతీరాజ్ అధికారులను కోరారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో జిల్లా పంచాయతీరాజ్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఇంతవరకు నియోజకవర్గ పరిధిలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల వివరాలు ఏపే పనులు పూర్తికాబడినవి, ఇంకా ఏ దశలో కొనసాగుతున్నాయి, ఇప్పటికే ప్రారంభం కానీ అభివృద్ధి పనులేవీ అన్న నివేదికను రెండు రోజులు వ్యవధిలో తన ముందు ఉంచాలని, ఇంతవరకు నియోజకవర్గంలో చేపట్టిన పనులన్నింటికీ బిల్లులు చెల్లింపులు అయ్యాయా, లేవా, ఒకవేళ ఇంకా అవ్వని ఎడల వాటి చెల్లింపులు విషయంలో తగిన చర్యలు యుద్ధ ప్రాతిపదికన తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులను కోరారు.

మహిళలు వ్యాపారవేత్తలుగా రాణించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - వీరఘట్టం

స్వయం సహాయక సంఘాల్లో గల ప్రతి మహిళా గొప్ప పారిశ్రామిక, వ్యాపార వేత్తగా అడుగులు వేయాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ సూచించారు. వైఎస్ఆర్ చేయూత మహిళా మార్ట్‌ను వీరఘట్టంలో శుక్రవారం ప్రభుత్వ విప్ పాలవలస విక్రాంత్‌తో పాటు కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మహిళా మార్ట్‌ను పరిశీలించి, స్వయంగా సరుకులను కొనుగోలు చేసి మహిళలను ప్రోత్సహించారు. మహిళా మార్ట్‌లో విక్రయ ప్రక్రియ, బిల్లింగ్ ప్రక్రియ, మార్కెటింగ్ తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మహిళా సంఘాలు బలోపేతమైనందుకు మహిళా మార్ట్ నిదర్శనమన్నారు. మహిళలు గొప్ప శక్తి సామర్థ్యాలు కలిగిన వారని ఆయన పేర్కొన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. మహిళల్లో అనుకున్నది సాధించే శక్తి సామర్థ్యాలు ఉన్నాయని, జిల్లాలో అటవీ ఉత్పత్తులు తదితర ఫలసాయాలు పెద్ద ఎత్తున మార్కెటింగ్ చేసేందుకు అవకాశం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ పి.కిరణ్‌కుమార్ వీరఘట్టం మండలంలో 1756 సంఘాల్లో 19316 మంది సభ్యులున్నారని తెలిపారు. సంఘ సభ్యులు వద్ద షేర్ కాపిటల్‌గా రూ.30 లక్షలు ఉందని తెలిపారు. మహిళా మార్ట్ నిర్మాణానికి రూ.16.19 లక్షలు వ్యయం చేశారని చెప్పారు. మహిళలు వ్యాపార రంగంలో ముందంజ వేయాలని రాష్ట్ర ప్రభుత్వం పలు కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకుని నేరుగా సరుకులు పంపిణీకి చర్యలు చేపట్టిందని అన్నారు. కార్యక్రమంలో స్థానిక అధికారులు, అనధికారికారులు, మహిళలు పాల్గొన్నారు.



మహిళా మార్ట్‌లో సరుకులను పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

నెరవేరని డిప్యూటీ సిఎం కోరిక

ఎమ్మెల్యేగానే పోటీ ● అరకు ఎమ్‌పి అభ్యర్థిగా భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి - సాలూరు

డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర కోరిక నెరవేరలేదు. ఎంపిగా పోటీ చేయాలన్న వాంఛ కలగానే మిగిలిపోతోంది. గత ఎన్నికల్లో కూడా ఆయన ఎంపి సీటు కావాలని కోరారు. కానీ వైసిపి అధిస్ఠానం ఆయన్ను ఎమ్మెల్యే గానే బరిలోకి దించింది. ఈ సారి ఎన్నికల్లో నైనా అరుకు ఎంపి సీటు కావాలని ఆయన పార్టీ నాయకత్వానికి అభ్యర్థించినట్లు తెలుస్తోంది. అయితే ఆయన అభ్యర్థనని అధిస్ఠానం పరిగణనలోకి తీసుకున్న దాఖలాల్లేవు. ఎందుకంటే కొద్ది రోజుల క్రితం అరుకు ఎంపి అభ్యర్థిగా పాడేరు ఎమ్మెల్యే కె.భాగ్యలక్ష్మిని పార్టీ ఖరారు చేసింది. దీంతో రాజన్నదొర ఎమ్మెల్యేగానే పోటీ చేస్తారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఆయన ఎమ్మెల్యేగా పోటీలో ఉంటే గెలుపు సునాయాసమవుతుందని పార్టీ నాయకులు, కార్యకర్తలు భావిస్తున్నారు. మరో మూడు నెలల్లో రానున్న ఎన్నికలు పార్టీకి అత్యంత కీలకం కావడంతో ఎమ్మెల్యేల గెలుపు అవసరమని అధిస్ఠానం భావిస్తున్నట్లు తెలుస్తోంది. తాజా పరిస్థితుల్లో ఆయన ఎమ్మెల్యేగా పోటీ చేయడమే ఉత్తమమని నాయకత్వం భావించినట్లు కనిపిస్తోంది. 2004లో మొదటిసారి రాజన్నదొర ఎమ్మెల్యే గా పోటీ చేసి ఓడిపోయారు. ఆ తర్వాత రెండేళ్లకు ఎమ్మెల్యేగా అదృష్టం ఆయన్ను వరించింది. మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్‌దేవ్ కులవివాదంపై రాష్ట్ర హైకోర్టు తీర్పు నేపథ్యంలో ఆయన్ను ఎమ్మెల్యేగా ఎన్నికైనట్లు కోర్టు ప్రకటించింది. ఆ తర్వాత జరిగిన మూడు ఎన్నికల్లోనూ ఆయన విజయపరంపర కొనసాగించారు.



డిప్యూటీ సిఎం రాజన్నదొరతో మాట్లాడుతున్న అరుకు పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌ఛార్జి భాగ్యలక్ష్మి

డిప్యూటీ సిఎంను కలిసిన పాడేరు ఎమ్మెల్యే

డిప్యూటీ సిఎం పి.రాజన్నదొరను శుక్రవారం పాడేరు ఎమ్మెల్యే కె.భాగ్యలక్ష్మి మర్యాదపూర్వకంగా కలిశారు. క్యాంప్ కార్యాలయంలో రాజన్నదొరను కలిసిన భాగ్యలక్ష్మి అరుకు ఎంపిగా తన గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. ఇటీవల వైసిపి అధిస్ఠానం అరుకు ఎంపి అభ్యర్థిగా కె.భాగ్యలక్ష్మిని ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఆమె రాజన్నదొరను కలిసి మద్దతు కోరినట్లు తెలుస్తోంది.

నవోదయ మోడల్ గ్రాండ్ టెస్ట్

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక శ్రీ గాయత్రీ కళాశాలలో శుక్రవారం యుటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో టాప్ -30 నవోదయ మోడల్ గ్రాండ్ టెస్ట్ నిర్వహించారు. ఈ టెస్ట్‌లో పాలకొండకు చెందిన ఎల్.అనీష్ (ఇంగ్లీష్ మీడియం 85) మొదటి స్థానంలో నిలిచాడు. అలాగే ఎల్ పార్ధు (తెలుగు మీడియం 83.75) ద్వితీయ స్థానం, వీరఘట్టానికి చెందిన వి.జీవన్ (ఇంగ్లీష్ మీడియం 80) తృతీయ స్థానం సాధించాడు. గెలుపొందున విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, మండల ప్రధాన కార్యదర్శి కె.గోవిందరావు, కార్యవర్గ సభ్యులు జెవి సూర్యప్రకాష్, వాసుదేవరావు, సతీష్, చంద్రమోహన్, అన్నాజీరావు, రాంబాబు, అప్పలనాయుడు, ఎస్.గణేష్, ఎల్ గణేష్, కళాశాల కరెస్పాండెంట్లు ఎస్.లోకేష్ , వివిధ మండలాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులను అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

పండగ వేళ అప్రమత్తం

ప్రజాశక్తి -పాలకొండ

పట్టణం, సమీప గ్రామాల ప్రజలంతా సంక్రాంతి పండగ సందర్భంగా అప్రమత్తంగా ఉండాలని సిఐ ఎం.చంద్రమౌళి కోరారు. పండుగ సందర్భంగా ప్రజలెవరైనా ఇళ్లు విడిచి వేరే ప్రదేశాలకు వెళ్లినప్పుడు పోలీసులకు ముందస్తుగా సమాచారం ఇవ్వాలని, అలాగే ఇంట్లో ఎటువంటి నగదు, ఆభరణాలు ఉంచకుండా తగు జాగ్రత్త వహించాలని అన్నారు. అలాగే ఎవరైనా అనుమానాస్పదంగా కనపడినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అన్నారు. మండలంలో కోడిపందాలు, పేకాటలు, ఏ పందాలు ఆడరాదని అన్నారు. ఇలాంటివి నిర్వహిస్తే చట్ట వ్యతిరేక చర్యలకు పాటుపడినట్లయితే వారిపై చట్టబద్ధమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. దీన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడానికి పోలీస్ శాఖ తరపున శుక్రవారం ఒక మైక్‌తో ప్రచారం నిర్వహించారు. అలాగే ట్రాఫిక్ విషయంలో కూడా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. విలేకరుల సమావేశంలో ఎస్ఐ ప్రశాంత్ కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

స్కూల్ అసిస్టెంట్ కేడర్ ప్రమోషన్లు వెంటనే ఇవ్వాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - కలెక్టరేట్

స్థానిక ఐటిడిఎ పరిధిలో గిరిజన సంక్షేమ ఆశ్రమ స్కూళ్లలో ఖాళీగా ఉన్న స్కూల్ అసిస్టెంట్ క్యాడర్ పోస్టులకు ప్రమోషన్లు ఇవ్వాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.రమేష్, ఎస్.మురళీమోహనరావు అధికారులను కోరారు. త్వరలో ఎలక్షన్ కోడ్ రానుందని, కావున అధికారులు స్పందించి ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని అన్నారు. స్కూల్ అసిస్టెంట్ క్యాడర్ ప్రమోషన్ కొరకు సీనియారిటి జాబితా వెంటనే విడుదల చేసి అప్పీల్ లిస్టు తీసుకొని ప్రమోషన్ ప్రక్రియను వెంటనే చేపట్టాలని పిఒను కోరారు. ప్రమోషన్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.

పరీక్షా కేంద్రాల్లో తనిఖీలు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

పదో తరగతి పరీక్షల సంచాలకులు (డైరెక్టర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్) డి.దేవానంద్‌రెడ్డి పార్వతీపురంలో పరీక్షా, మూల్యాంకన కేంద్రాలను శుక్రవారం పరిశీలించారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ఎటువంటి లోటుపాట్లు వుండరాదని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో డిఇఒ ఎన్.ప్రేమకుమార్, పరీక్షలు సహాయ కమినర్ వున్నారు.

పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న దేవానంద్‌రెడ్డి





నాక్ ధ్రువపత్రాలను అందుకుంటున్న ప్రిన్సిపల్, సిబ్బంది

డిగ్రీ కళాశాలకు నాక్ బి ప్లస్ గ్రేడ్

ప్రజాశక్తి - సాలూరు

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడిటేషన్ కమిటీ (నాక్) బి ప్లస్ గ్రేడ్ లభించింది. ఈ నెల 5,6 తేదీల్లో డిగ్రీ కళాశాలను సందర్శించిన నాక్ బృందం కళాశాలలో విద్యార్థులకు జరుగుతున్న బోధన తీరుతెన్నులు, పరిశోధన, సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విద్య అమలు, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే రీతిలో శిక్షణ వంటి అంశాలను పరిశీలించింది. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాసమూర్తి నాక్ బృందానికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కళాశాలలో జరుగుతున్న అభివృద్ధి, బోధనా తీరు కార్యక్రమాల గురించి వివరించారు. ఈ నేపథ్యంలో నాక్ బృందం కళాశాలకు బి ప్లస్ గ్రేడ్ ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. దీనిపై కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.



సంప్రదాయ వస్త్రధారణలో చిన్నారులు

ఘనంగా సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక శ్రీ గాయత్రి పాఠశాల, కళాశాల ఆవరణలో శుక్రవారం ఘనంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే వివిధ రకాల సినీ గేయాలతో నృత్యం చేశారు అలాగే సాంప్రదాయ ప్రకారం భోగి మంటలు ఏర్పాటు చేయడంతో పలువుర్ని ఆకట్టుకుంది. కార్యక్రమంలో కరస్పాండెంట్లు ఎస్.లోకేష్, ప్రిన్సిపల్ కె.సింహాచలం, ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ రాక

ప్రజాశక్తి - సాలూరు

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం నియోజకవర్గంలో పర్యటించనున్నారు.ఉదయం 11.30 గంటలకు పాచిపెంట మండలం పణుకువలస గ్రామం లో కేంద్ర ప్రభుత్వం అద్వర్యాన నిర్వహిస్తున్న వికసిత్ భారత్ కార్యక్రమంలో పాల్గొంటారు.అక్కడ పిటిజి తెగలకు చెందిన గిరిజనులతో మాట్లాడతారు.అనంతరం సాలూరు పట్టణం లో ప్రయివేటు కార్యక్రమానికి కూడా హాజరవుతారు.

ఏగోటివలసలో వికసిత్ భారత్

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని ఏగోటివలసలో శుక్రవారం వికసిత్ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ ఎంఎస్ఎల్ఎన్ ప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అంశాలపై వివరించారు. అలాగే వివిధ సంక్షేమ పథకాలపై మాట్లాడుతూ అర్హులైన వారికి ఈ పథకాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్డి కెకె కుమార్ వర్మ, వైద్య సిబ్బంది వరలక్ష్మి, రమాదేవి, ప్రజలు పాల్గొన్నారు.

నిశ్శంకపురంలో ఎమ్మెల్యే పర్యటన

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

మండలంలోని ఎంఆర్ నగరం పంచాయతీ నిశ్శంకపురానికి చెందిన వైసిపి కుటుంబీకులు బర్ల తవుడు అకాల మరణం చెందిన విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు శుక్రవారం స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులతో కలిసి గ్రామానికి వెళ్లి తవుడు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే గ్రామంలో ప్రజలను కలుసుకుని వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట మండల టిడిపి అధ్యక్షులు బొమ్మి రమేష్, వైస్ ఎంపిపి బి.రవికుమార్, ఎంపిపి ప్రతినిధి మజ్జి శేఖర్, ఆత్మ చైర్మన్ యంద్రాపు తిరుపతిరావు, ఎంపిటిసి సభ్యులు బడే రామారావు, సర్పంచ్ మడక విశ్వనాథం, గండి శంకరరావు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఏనుగులను రెచ్చగొడితే ప్రమాదం

ప్రజాశక్తి - భామిని

ఏనుగులపై కవ్వింపు చర్యలు చేస్తే ప్రమాదమని మండలంలోని ఘనసరి, కేసరి, కొసలి, అత్తికొత్తూరు, బాలేరు గ్రామాల్లో ఆటోలో తిరుగుతూ అవగాహన కరపత్రాలు అతికిస్తూ ప్రచారం నిర్వహించారు. పండగ సందర్భంగా స్వగ్రామాలకు వచ్చి పండగ జరుపుకునే వారు ఏనుగులను చూద్దామని అవి సంచరించే పరిసర ప్రాంతాలకు వెళ్లొద్దని, కవ్వింపు చర్యలు చేస్తే ఏనుగులు దాడి చేస్తాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాత్రులు ఏనుగుల కదలికలు ఉంటుందని, కావున ఆ సమయాల్లో పరిసర ప్రాంతాల్లో సంచరించొద్దని ఫారెస్ట్ సిబ్బంది ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ అధికారి లక్ష్మణమూర్తి, సిబ్బంది ఉన్నారు.

పండగ వేళ ఇబ్బందుల్లేకుండా చర్యలు

ప్రజాశక్తి - కొమరాడ

సంక్రాంతి పండుగ వేళ ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చర్యలు చేపడుతున్నట్లు కోటిపాము సర్పంచ్ సుంకరి సుగుణ అన్నారు. శుక్రవారం కోటిపాంలో సర్పంచ్ సుగుణ ఆధ్వర్యాన కాలువలు, రోడ్లును శుభ్రం చేయిస్తున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలోని సంక్రాంతి పండుగ నేపథ్యంలో వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న ప్రజలకు అసౌకర్యాలు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు తనవంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. రోడ్లపై ఉన్న చెత్తాచెదారని తొలగించి పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. వలసలు వెళ్లిన ప్రజలు పండగ సందర్భంగా స్వగ్రామానికి తిరిగి వచ్చే సమయంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ముఖ్యంగా గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కాలువల్లో శుభ్రం తో పాటు వీధుల్లో శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ వేస్తామని తెలిపారు.

రేగులమానుగూడలో భవిష్యత్తు గ్యారంటీ

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని రేగులమానుగూడలో ప్రజలతో టిడిపి నాయకులు పడాల భూదేవి భవిష్యత్ గ్యారంటీ పథకాలు గురించి అవగాహన కనిపిస్తున్నారు. చంద్రబాబును మళ్లీ సిఎంను చేసేందుకు అంతా సహకరించాలని కోరారు. చంద్రబాబుతోనే గిరిజన అభివృద్ధి అని అన్నారు. టిడిపి మేనిఫెస్టో గురించి అవగాహన కల్పించారు. ఇంటింటికి వెళ్లి, గిరిజనుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



రేగులమానుగూడలో పర్యటిస్తున్న భూదేవి

ఘనంగా స్వామి వివేకానంద జయంతి

ప్రజాశక్తి -వీరఘట్టం

మండలంలోని స్వామి వివేకానంద జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిట్టపూడివలస గ్రామ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు సాకేటి రాంబాబు ఆధ్వర్యంలో స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి ఎన్ శివ, విద్యార్థులు పాల్గొన్నారు.

వృద్ధులకు, పేద మహిళలకు రగ్గులు పంపిణీ

పార్వతీపురం టౌన్ : స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్లో హెడ్కానిస్టేబుల్గా వృద్ధమిత్ర కో-ఆర్డినేటర్గా విధులు నిర్వహిస్తున్న కె.కృష్ణమూర్తి ప్రతి నెల వలే ఈ నెలలోనూ తమ సొంత నిధులతో శుక్రవారం స్వామి వివేకానంద జన్మ దినోత్సవం, జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా అడ్డాపుశిల పంచాయతీ పరిధిలో గల గదబవలసలోని 40 మంది పేద మహిళలకు, వృద్ధులకు రగ్గులు, స్టీల్ గ్లాసులు ఆ గ్రామ పెద్దలైన గొర్లి సింహాచలం, గుమ్మడి నారాయణ, కశయ్య, నాగేశ్వరావు, పారా లీగల్ వాలంటీర్ వి.శ్రీనివాసరావు రాజు సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ, పోలీస్ శాఖలో కృష్ణమూర్తి లాంటి వ్యక్తి ఉండడం ఎంతో అభినందనీయమన్నారు. ఆయన్ను ప్రతి ప్రభుత్వ ఉద్యోగి ఆదర్శంగా తీసుకొని ఇతరులకు సహాయం చేసేందుకు ముందుకు రావాలని అన్నారు.

పార్వతీపురం రూరల్ : స్వామి వివేకానంద జయంతి సందర్భంగా పార్వతీపురంలోని పలుచోట్ల కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. పట్టణం శివారు రాయగడ రోడ్డులోని జట్టు ఆశ్రమం, నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో యోజన ఉత్సవాలను ఆశ్రమ నిర్వాహకులు వి.పద్మజ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాల శుభ్రతపై వ్యక్తిత్వ వ్యాసరచన, చిత్రలేఖన, వంటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అలాగే బైపాస్ రోడ్డులో ఉన్న టిడిపి కార్యాలయంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ బోనెల విజయచంద్ర ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొని వివేకానంద స్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాయగడ రోడ్డు వివేకానంద కాలనీలో స్థానిక యువత ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వివేకానందుని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.



పార్వతీపురం : పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న కృష్ణమూర్తి, గ్రామపెద్దలు

గరుగుబిల్లి : మండలంలోని రావివలస, నాగూరులో జాతీయ యువజన దినోత్సవం, స్వామి వివేకానంద 161వ జయంతోత్సవాలు జరిగాయి. రావివలసలో అరకు పార్లమెంటరీ తెలుగు యువత ఉపాధ్యక్షులు కోట భరత్ (సుమన్), మండలం టిడిపి అధ్యక్షులు అక్కేన మధుసూద నరావు నాగూరు హైస్కూల్ ఆవరణంలో స్వామి వివేకానంద విగ్రహనికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ నేటి యువత స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకొని మన దేశాన్ని ప్రపంచంలోనే శక్తివంతంగా తయారవ్వడానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో గుంట్రెడ్డి వెంకట్ నాయుడు, గంట ముసలి నాయుడు, గొర్లి కిషోర్, దామోదర్ నాయుడు, కర్రి సంతోష్, శ్రీనివాసరావు ఫ్రెండ్స్ యూత్ యువజన సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కురుపాం : యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి ఉత్తమ మార్గంలో నడిచి ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ వి.షణ్ముఖరావు అన్నారు. శుక్రవారం మండలంలోని బియ్యాలవలస పంచాయతీ దురిబిలి గిరిజన గ్రామంలో ఎస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ యువజన దినోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి, ఉన్నత విద్యను అభ్యసించడం ద్వారా సమాజంలో మంచి గుర్తింపు వస్తుందని అన్నారు. అనంతరం యువతకు వాలీబాల్ కిట్లు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్టేట్ బ్యాంక్ మేనేజర్ ప్రవీణ్ ,స్థానిక సర్పంచ్ పి. అజ్జారి,యస్ సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్, బియ్యాలవలస, గొటివాడ యువత ఎస్ సొసైటీ సభ్యులు లక్ష్మి, మాజీ సర్పంచ్ పువ్వుల పత్తి పాల్గొన్నారు.

సీతంపేట :మండలంలో రామగిరి క్షేత్రం సమీపంలో ఉన్న భారతి ఇంటర్నేషనల్ స్కూల్లో స్వామి వివేకానంద జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జాతీయ యువజన దినోత్సవం ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా కరస్పాండెంట్ ఎస్పీ పెంటయ్య స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు .కార్యక్రమంలో ఉపాధ్యాయులు మురళీమోహన్ దివాకర్ సురేష్ పార్వతి మురళి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



సీతానగరం : సభలో మాట్లాడుతున్న స్వచ్ఛందసంస్థల నాయకులు రాజగోపాల్



సీతంపేటలో విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ప్రిన్సిపల్ పెంటయ్య



గరుగుబిల్లి : రావివలసలో వివేకానంద విగ్రహానికి పూలమాల వేస్తున్న భరత్



సభలో మాట్లాడుతున్న సబ్ డిఎఫ్ఒ సంజీవ్

గిరిజనుల అభివృద్ధే 'ఆర్ట్' ధ్యేయం

కురుపాం : గిరిజన ప్రాంతంలో పనిచేస్తూ గిరిజనులను చైతన్యపరుస్తూ అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్న ఆర్ట్ సంస్థ సేవలు అభినందనీయమని సబ్డిఎఫ్ఒ సంజీవ్ అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్ట్స్ కార్యాలయంలో సంస్థ డైరెక్టర్ ఎన్.సన్యాసిరావు ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ యువజన దినోత్సవనికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30ఏళ్లుగా గిరిజన హక్కులపైన, చట్టాలపైన పనిచేస్తూ ముఖ్యంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు ఉపాధి హామీ చట్టం, అటవీ హక్కులపై గిరిజన మారుమూల గ్రామాల్లో ప్రతి గిరిజన ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఆర్ట్ సంస్థ నుంచి గిరిజన యువతకు అనేక వృత్తి నైపుణ్య శిక్షణ ఇచ్చి వారి జీవన అభివద్ధికి ఎంతగానో కృషి చేస్తున్న ఆర్ట్స్ సంస్థ సేవలు హర్షించదగ్గవిగా ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో ఆర్ట్ సంస్థ జిల్లా యూత్ కోఆర్డినేటర్ సందీప్, యూత్ లీడర్స్ ఎన్.చిరంజీవి, ఎం.సూర్యం, సుగ్రీవులు, ఆలిమ్మ, రాధా, రజిత, రోజారాణి, ఊర్మిళ, సిబ్బంది పాల్గొన్నారు.

జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవాలి : పిఒ

ప్రజాశక్తి - పార్వతీపురం

జీవవైవిద్యాన్ని కాపాడుకోవాలని అందుకుగాను ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు సమన్వయంతో కృషి చేయాలని ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్ తెలిపారు. శుక్రవారం కలెక్టరు కార్యాలయ సమావేశమందిరంలో రెయిన్ఫారెస్ట్ అలయన్స్ లీడ్ ఎగ్జిక్యూటింగ్ ఏజెన్సీ వారిచే సస్టైనబుల్ అగ్రికల్చర్ అండ్ బయోడైవర్సిటీ అక్రాస్ ల్యాండ్స్కేప్స్ ప్రాజెక్ట్పై అవగాహన సదస్సును నిర్వహించారు. సదస్సులో పిఒ మాట్లాడుతూ వాతావరణ మార్పులు, అడవులు ఆక్రమణ, వ్యవసాయక్షేత్రాల విస్తరణతో జీవవైవిద్యం దెబ్బతింటుందని తెలిపారు. దీన్ని కాపాడేలా సమీకృత వ్యవసాయ విధానాన్ని చేపట్టాలని, అందుకు ప్రజలను ప్రోత్సాహించాలన్నారు. సమీకృత వ్యవసాయ విధానంతో సామాజిక ఆర్థికాభివృద్ధి కూడా సాధించేలా ప్రణాళిక రూపొందించాలని వ్యవసాయ అనుబంధ శాఖలకు సూచించారు. ప్రభుత్వం, రైతు సాధికార సంస్థ, స్థానిక పౌర సమాజ సంస్థల భాగస్వామ్యంతో చేపట్టిన ఈ ప్రాజెక్టుకు రెయిన్ఫారెస్ట్ అలయన్స్ ఈ ప్రాజెక్ట్ కు లీడ్ ఎగ్జిక్యూటింగ్ ఏజెన్సీగా వ్యవహరిస్తుందని, యునైటెడ్ నేషన్స్ ఎన్విరాన్మెంట్ ప్రోగ్రామ్- ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ అమలు చేసే ఏజెన్సీలను వారితో సమన్వయం చేసుకుంటూ ఈ ప్రాజెక్టును విజయవంతం చేయాలని తెలిపారు. ప్రాజెక్టు వివరాలను మండల, గ్రామ స్థాయికి తీసుకువెళ్లాలని అధికారులకు తెలిపారు. రెయిన్ఫారెస్ట్ అలయన్స్ సంస్థ కన్సల్టెంట్ కె.శ్రీధర్ ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను పవర్ పాయింటు ప్రజెంటేషను ద్వారా వివరించారు. అటవీ, పర్యావరణం, వాతావరణ మార్పుల కేంద్ర మంత్రిత్వ శాఖ 2022లో తిరిగి కుదుర్చుకున్న అవగాహన ఒప్పందంలో భాగంగా గ్లోబల్ ఎన్విరాన్మెంట్ ఫెసిలిటీ (జీఈఎఫ్) ప్రాజెక్టుకు ఆంధ్రప్రదేశ్ ఎంపికైంది. - నేతృత్వంలోని 'వ్యవసాయ వ్యవస్థలను మార్చడం మరియు స్థిరమైన ప్రకృతి దృశ్యం నిర్వహణ, ప్రభుత్వ-ప్రైవేట్ ఫైనాన్స్ ద్వారా భారతదేశంలోని అధిక జీవవైవిధ్య ప్రాంతాల్లో స్థానిక ఆర్థిక వ్యవస్థలను బలోపేతం చేయడం ఇప్పటివరకు రాష్ట్రంలోని ఐదు జిల్లాల్లో ప్రారంభమైందని, త్వరలో 16 జిల్లాల్లో చేపడతామన్నారు. కురుపాం మండలంలో ఉరిడి పంచాయితీలో గల 13 గ్రామాల్లో ఈ ప్రాజెక్టు అమలు చేస్తున్నట్టు తెలిపారు. సుమారుగా 1570 హెక్టార్ల విస్తీర్ణంలో, కొండబారిడి మైక్రో ల్యాండ్స్కేప్ ఇంప్లిమెంటేషన్ కార్యక్రమం చేపడతామన్నారు. రెయిన్ ఫారెస్ట్ అలయన్స్ సంస్థ స్టేట్ టీం లీడరు పి.వినూత్న మాట్లాడుతూ ప్రోజెక్టు విజయవంతం చేసేందుకు, ప్రజలకు ఆర్థికంగా అధిక ఆదాయం చేకూర్చేందుకు వ్యవసాయ అనుబంధశాఖల ద్వారా ప్రోత్సాహాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్వైఎస్ఎస్ డిఎం పి.షణ్ముఖరాజు, జిల్లా ఉద్యాన అధికారి కె.ఎస్.వరప్రసాద్, మత్స్యశాఖ, వ్యవసాయశాఖ మరియు ఇతర అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్

వైసిపి హయాంలో కుంటుపడ్డ గిరిజనాభివృద్ధి

ప్రజాశక్తి - కురుపాం

వైసిపి పాలనలో గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి కుంటుపడిందని అరుకు పార్లమెంట్ ఎస్టీ సెల్ అధికార ప్రతినిధి నందివాడ కృష్ణబాబు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో గల టిడిపి కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో ప్రజలంతా రోడ్డుమీదకు వచ్చి ఆందోళనలు చేసే పరిస్థితి వచ్చిందన్నారు. ఈ నాలుగున్నరేళ్ల పాలనలో గిరిజన ప్రాంతంలో అభివృద్ధి చేసిందేమీ లేదన్నారు. గిరిజన అభివృద్ధి కోసం ఉన్నటువంటి ఐటిడిఎ పూర్తిగా నిర్వీర్యం అయిపోయిందని ఎద్దేవా చేశారు. టిడిపి అధికారంలోకి వచ్చాక గిరిజన ప్రాంతాలను అభివృద్ధి బాటలో నడిపిస్తామన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కలిశెట్టి కొండయ్య, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆశీల వేలం 19కి వాయిదా

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం జరగాల్సిన మార్కెట్ ఆశీలు వేలంపాట వాయిదా పడింది. ఈ మార్కెట్ అశీలు వేలంపాటకు ఒకే ఒక్క పాటదారులైన బూరాడ ప్రసన్న తరపున పాట పాడేందుకు గుంట రాజు హాజరై మిగతా పాటదారులు హాజరు కాకపోవడంతో కావడంతో మున్సిపల్ కమిషనర్ జె.రామఅప్పలనాయుడు ఆదేశాల ప్రకారం మున్సిపల్ రెవెన్యూ అధికారి దిబ్బారూబెను ఈ ఆశీలు వేలం పాటను ఈనెల 19కి వాయిదా వేసినట్లు తెలిపారు.



నీటి నిల్వలను పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి జగన్మోహనరావు

పరిసరాల శుభ్రతపై అవగాహన

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

దోమల వ్యాప్తిని నిర్మూలించడమే ధ్యేయంగా డ్రైడే కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా మలేరియా అధికారి (డిఎంఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. ఈ మేరకు ఆయన ఇందూపురం, గంగాపురం గ్రామాల్లో డ్రైడే కార్యక్రమాలను శుక్రవారం పరిశీలించారు. గ్రామ వీధుల్లోనూ, ఇంటి పరిసరాల్లో పరిశీలిస్తూ దోమలు వృద్ధి చెందే ప్రదేశాలపై దృష్టి సారించారు. నీరు నిల్వ ఉన్న కుండీలు, రుబ్బురోళ్లు, టైర్లు, పాడైన ప్లాస్టిక్ వస్తువులు మొదలగు వాటిలో దోమల లార్వాల ఉనికి కోసం నిశితంగా పరిశీలించారు. నీటి నిల్వలను పారబోయించారు. వాడుక కుండీల్లో నీరు ఎక్కువకాలం నిల్వ ఉంచరాదన్నారు. నీరు నిల్వ ఉన్న చోట దోమల ఉత్పత్తికి, వ్యాప్తికి ప్రధాన కారకాలుగా ఉంటాయని, ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని ఇందుకోసమే డ్రైడే కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. వైద్య, తదితర శాఖల సిబ్బంది సమన్వయంతో డ్రైడే కార్యక్రమాలు పక్కాగా నిర్వహించి ప్రజల్లో అవగాహన పెంపొందించాలన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ జగన్మోహనరావు అక్కడ ప్రజలతో, సిబ్బందితో మాట్లాడి గ్రామంలో ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. పరిసరాల పరిశుభ్రత,వ్యాధి కారకాలపై అవగాహన కల్పించారు. ఆయన వెంట ఎఎంఒ సూర్యనారాయణ, ఎఎన్ఎం సరోజిని, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న క్రీడా పోటీలు

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక జిల్లా పరిషత్తు బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో శుక్రవారం ఆడుదాం ఆంధ్రలో భాగంగా క్రీడా పోటీలు కొనసాగుతున్నాయి. తొలుత ఎంపిడిఒ డి.శ్వేత క్రీడా పోటీలు ప్రారంభించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు, ఎస్.ఉమా మహేశ్వరరావు, పద్మరాజు, కె.సాల్మన్ రాజు, ఎం.రామకృష్ణ, వి.రాజేంద్ర, భాస్కరరావు, టి.మధు, కె.పృద్వీ, క్రీడాకారులు పాల్గొన్నారు.



ఖోఖో ఆడుతున్న బాలికలు

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

ప్రజాశక్తి - మక్కువ

మండల కేంద్రమైన మక్కువలో ప్రస్తుత పండగ వాతావరణం నెలకొన్న తరుణంలో ట్రాఫిక్కు అంతరాయం కలగకుండా చర్యలు చేపడుతున్నట్లు ఎస్ఐ పి.నరసింహమూర్తి తెలిపారు. శుక్రవారం బజారు రహదారిలో రాకపోకలకు అంతరాయం కలిగిస్తూ ఏర్పాటు చేసిన చిల్లర దుకాణాలను దూరంగా పెట్టుకోవాలని దుకాణదారులను ఆదేశించారు. రాకపోకలకు అంతరాయం కలిగించేలా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కత్తుల కవిటిలో జెఎఎస్

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని కత్తులకవిటిలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బిటివాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి గిరీష వివిధ రకాలైన రోగులకు తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గేదల సరోజిని, జెడ్పిటిసి జంపు కన్నతల్లి - ఉమామహేశ్వరరావు, ఎంపిటిసి సభ్యులు కె.పరిమళ, సచివాలయ కార్యదర్శి రాము, వైద్యసిబ్బంది, వాలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి : మండలంలోని నాగూరులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఉరిటి రామారావు, జెడ్పీ వైస్చైర్మన్ మరిశర్ల బాపూజీ నాయుడులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తలపెట్టారన్నారు. ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్యశిబిరంలో వైద్యాధికారులు డాక్టర్ కె.కీర్తి, డాక్టర్ స్నిగ్ధ, డాక్టర్ దివ్య తదితరులు వైద్య సేవలుఅందించారు. కార్యక్రమంలో సర్పంచ్ కేతిరెడ్డి శిరీష, ఎంపిడిఒ జి.పైడితల్లి, వైసిపి నాయకులు కేతిరెడ్డి అచ్యుతరావు, అక్కేన వెంకటనాయుడు, గ్రామపంచాయతీ కార్యదర్శి సిహెచ్ సంధ్య, రావివలస పిహెచ్సి సిబ్బంది పాల్గొన్నారు.




గరుగుబిల్లిలో ఆరోగ్య సురక్షను పరిశీలిస్తున్న ఎంపిపి, జెడ్పీ వైస్చైర్మన్

మున్సిపల్ కార్మికులకు బట్టలు పంపిణీ

ప్రజాశక్తి - సాలూరు

మున్సిపల్ కార్మికులకు సంక్రాంతి పండుగ సందర్భంగా శుక్రవారం చైర్పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ కొత్త బట్టలు పంపిణీ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో కార్మికులకు కాకీ యూనిఫాం, చీరలు, తువ్వాళ్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్మికుల సంక్షేమమే పరమావధిగా ప్రభుత్వం పని చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో కమిషనర్ టి.జయ రాం, శానిటేషన్ ఇన్ స్పెక్టర్ ఫకీర్ రాజు పాల్గొన్నారు.



కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న చైర్పర్సన్ ఈశ్వరమ్మ

టిడిపిలో 200 కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి - వీరఘట్టం

పాలకొండ నియోజకవర్గం టిడిపి ఇన్ఛార్జి నిమ్మక జయకృష్ణ సమక్షంలో శుక్రవారం ఎం.రాజపురంలో వీరఘట్టం దళిత వీధి చెందిన సుమారు 200 కుటుంబాలు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి చింత ఉమామహేశ్వరరావు దళితులు పాల్గొన్నారు.

700 సారా ప్యాకెట్లు స్వాధీనం

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని పి.కోనవలస, కందిరివలస గ్రామాల వద్ద ఇద్దరు వ్యక్తుల నుండి 700 సారా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎఎస్ఐ బెల్లాన ముసలయ్య తెలిపారు. మండలంలోని పెద్దవలసకు చెందిన కళ్లికోట చందు నుండి 300 ప్యాకెట్లు, మక్కువ మండలం వెలగాడ జంపాయ్ నుంచి 400 ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎఎస్ఐ తెలిపారు.